తగ్గని వలంటీర్లు..!



రాయదుర్గం వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తరఫున వలంటీర్లు ప్రచారం కొనసాగిస్తున్నారు. పార్టీ కండువాలు భుజాన వేసుకుని మరీ కరపత్రాలను పంచుతున్నారు. కణేకల్లు మండలం సొల్లాపురంలో వలంటీర్లు రాజశేఖర్, శ్రీనాథ్ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని అధికారులు ఆదేశించినా.. పెడచెవిన పెడుతున్నారు. - కణేకల్లు

రోడ్డుపై రేషన్..!



పాపంపేట బాలాజీ విల్లాస్ సమీపంలో రేషన్ కోసం నిరీక్షిస్తున్న కార్డుదారులు

ఇంటింటికీ రేషన్ పేరిట ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాలు కార్డుదారులను నడిరోడ్డుపై నిలబెడుతున్నాయి. డీలర్ల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పని లేదని, కార్డుదారుల ఇంటి వద్దకే సరుకుల వాహనం వస్తుందని వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రచారం చేసుకుంది. కానీ క్షేత్రస్థాయిలో కష్టాలు రెట్టింపు అయ్యాయి. డీలర్ వద్దకు వెళితే గంటకో, రెండు గంటలకో బియ్యం, ఇతర సరుకులు అందేవి. కానీ ఇప్పుడు ఎండీయూ వాహనం వీధిలోకి ఎప్పుడు వస్తుందో, ఏ సందులో ఉందో వెతుక్కోవాల్సి వస్తోంది. వాహనం వచ్చాక రోడ్డుపై నిలబడి సరుకులను తీసుకోవాల్సి వస్తోంది. మధ్యలో సర్వర్ సమస్య వస్తే ఇక కార్డుదారులకు నరకమే..! గతంలో నెలలో పదిహేను రోజులు రేషన్ దుకాణాల్లో సరుకులు ఇచ్చేవారు. కుదిరినప్పుడు ఏదో ఒక రోజు వెళ్లి సరుకులు తీసుకునేవారు. ఎండీయూ వాహనాలు వచ్చాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్డుదారులు వాపోతున్నారు.

- అనంతపురం రూరల్



పాపంపేట బాలాజీ విల్లాస్ సమీపంలో రేషన్ బియ్యం కోసం క్యూలో నిలుచున్న కార్డుదారులు

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



సమీక్షా సమావేశంలో కలెక్టర్, ఎస్పీ, జేసీ

అనంతపురం టౌన్, మార్చి 12: సార్వత్రిక ఎన్నికలను జిల్లాలో పారదర్శకంగా నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని కలెక్టరు గౌతమి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అన్ని నియోజకవర్గాల ఆర్‌ఓలు, డీఎస్పీలు, ఏఆర్‌ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ ఏ సమయంలోనైనా రావచ్చునని, సిద్ధంగా ఉండాలని సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో పోలీసులతో కలిసి సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆర్‌ఓలకు సూచించారు. జిల్లాస్థాయిలో కమాండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు సంబంధించి అధికంగా ఫిర్యాదులు వచ్చే అవకాశం ఉందని, వాటిని సకాలంలో విచారించి నివేదిక ఇవ్వాలని, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండురోజుల్లోగా సెబ్, ఐటీ టీమ్‌లను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రతి వాహనాన్నీ ఖచ్చితంగా తనిఖీ చేయాలని, వాటిని నివేదికలు పంపాలని ఆదేశించారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, రాప్తాడు, ఉరవకొండ నియోజకవర్గాలలోని అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రౌడీ షీటర్లను గుర్తించి, ఎన్నికలు సజావుగా జరగడానికి కృషిచేయాలని అన్నారు. అధికారులు, పోలీసుల మధ్య సమన్వయం ఈ సమయంలో అత్యంత కీలకమని ఎస్పీ అన్బురాజన్ అన్నారు. గ్రామ, మండల స్థాయిలో ప్రతి రోజూ కలిసి పనిచేయాలని సూచించారు. జిల్లాలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, అక్కడ మరింత బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. సమావేశంలో జేసీ కేతన్ గార్గ్, జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా దేవి, నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డీఐఓ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సెంట్రలైజ్డ్

కంట్రోల్ రూమ్: జేసీ

అనంతపురం టౌన్: సాధారణ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జేసీ కేతన్ గార్గ్ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌లో అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికపుడు తెలుసుకుని, పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడ ఐదు రకాల కంట్రోల్‌రూమ్‌లు ఉన్నాయని, ఫీల్డ్ మేనేజ్‌మెంట్ యూనిట్, ఎంసీసీ యూనిట్, ఎక్స్‌పెన్సెస్ మానిటరింగ్ యూనిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్, కంప్లయింట్ యూనిట్ ఉంటాయని తెలిపారు. వీటికి ఎంపికచేసిన అధికారులకు విధులపట్ల అవగాహన ఉండాలని అన్నారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదలపై నివేదికలు రూపొందించి, ఎప్పటికపుడు జిల్లా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. అభ్యర్థుల వాహనాలకు, సమావేశాలకు అనుమతి ఇచ్చే అంశాలపై అవగాహన ఉండాలని అన్నారు. ఎక్కడా ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరగరాదని అన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, జేడీఏ ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం జగన్ (ఫైల్)



- పరిహారం కోసం రైతుల ఎదురుచూపు
- వారం క్రితం బటన్ నొక్కిన సీఎం జగన్
- 1.79 లక్షల హెక్టార్లకు రూ.251.2 కోట్లు మంజూరు



గుత్తి రూరల్ మండలంలో దిగుబడి లేని వేరుశనగ పంట



రాప్తాడులో కాయలేని వేరుశనగ కట్టె



ఉష్ణోగ్రతలు 12-3-2024

గరిష్ఠం : 40.0

కనిష్ఠం : 26.0



నేరుగా... జమకాలేదు..!

బటన్ నొక్కే ప్రతిసారీ సీఎం జగన్ 'నే...రుగా నా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి, రైతుల ఖాతాల్లోకి సొమ్ము జమ అవుతోంది..' అని అంటుంటారు. కానీ నేరుగా వెంటనే జమ కావడం లేదని లబ్ధిదారులు వాపోతుంటారు. రోజుల తరబడి ఎదురుచూస్తుంటారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తుంటారు. ప్రస్తుతం రైతులది అదే పరిస్థితి. ఖరీఫ్ పంట నష్టపరిహారం సొమ్ముకోసం వారం నుంచి వేచి చూస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా డబ్బు జమకాకుంటే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు.

అనంతపురం అర్బన్, మార్చి 12: సీఎం జగన్ ఇన్‌పుట్ సబ్సిడీ బటన్ నొక్కి వారం గడిచినా రైతుల ఖాతాలో డబ్బులు జమకాలేదు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల ఇప్పుడో.. అప్పుడో అన్నట్లుగా ఉంది. కోడ్ అమలులోకి వచ్చేలోగా డబ్బులు జమకాకపోతే.. ఆపై ఎన్నికలు ముగిసేదాకా తమ గురించి పట్టించుకునేవారు ఉండరని రైతులు ఆందోళన చెందుతున్నారు. 2023-24 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు భారీగా నష్టపోయారు. ప్రధాన పంట వేరుశనగతోపాటు అన్నిరకాల పంటలు దెబ్బతిన్నాయి. పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో గత ఏడాది నవంబరులో జిల్లాలోని 28 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. జిల్లా వ్యాప్తంగా 1.79 లక్షల హెక్టార్లల్లో రూ.251.2 కోట్ల పంటనష్టం జరిగినట్లు అప్పట్లో జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక పంపింది. డిసెంబరు రెండో వారంలో కేంద్ర కరువు బృందం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. దెబ్బతిన్న పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి పంటనష్టం వివరాలను సేకరించింది.



ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కును విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమి(ఫైల్)

బటన్ నొక్కి వదిలేశారు..

ఏ సీజన్‌లో పంటనష్టం జరిగితే ఆ సీజ్ ముగిసిన వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకుంటామని వైసీపీ ప్రభుత్వం గొప్పలుపోయింది. కానీ రైతులకు పంటనష్ట పరిహారం అందించకుండా జాప్యం చేస్తోంది. ఈ ఏడాది సంక్రాంతి పండుగలోగా ఇన్‌పుట్ సబ్సిడీ డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం అప్పట్లో ప్రకటించింది. కానీ పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్మును విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. సంక్రాంతి పండుగలోగా లేదా గత నెలలో ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసి ఉంటే ఇప్పటికే రైతులకు పరిహారం దక్కేది. కానీ ఎన్నికల ముంగిట హడావుడిగా సీఎం జగన్ బటన్ నొక్కి వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి.

వారం గడిచింది..

2023-24 ఖరీఫ్‌లో పంట నష్టపోయిన జిల్లా రైతులకు రూ.251.2 కోట్ల పరిహారాన్ని ఈ నెల 6వ తేదీన తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. జిల్లాకు సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కును జిల్లా యంత్రాంగం విడుదల చేసింది. ఇది జరిగి వారం గడిచినా జిల్లాలో ఒక్క రైతు ఖాతాలోనూ పరిహారం జమ కాలేదు. గతంలో సీఎం బటన్ నొక్కిన మరుసటి రోజు నుంచి రైతులలో సొమ్ము జమయ్యేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడం సందేహాలకు తావిస్తోంది. ఎన్నికల సమయంలో రైతులను మభ్యపెట్టేందుకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశారా అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. కోడ్ అమలులోకి వచ్చేలోగా సొమ్ము జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఖరీఫ్‌లో భారీగా పంట నష్టం



రాప్తాడు మండలం రామినేపల్లి, హంపాపురం వద్ద ఎండిన వేరుశనగ పంట

జమ కాలేదు

మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేసి నష్టపోయాను. వ్యవసాయ శాఖ అధికారులు ఈ క్రాపింగ్ చేసి, ఈకేవైసీ తీసుకున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ జాబితాలో నా పేరు ఉంది. సీఎం బటన్ నొక్కడంతో పరిహారం జమ అవుతుందని ఆశ పడ్డాను. కానీ ఇంతవరకు డబ్బులు జమ కాలేదు. ఎప్పటిలోగా పరిహారం సొమ్ము జమ చేస్తారో తెలియడం లేదు.



- కొండారెడ్డి, ఇరువెందుల, శింగనమల మండలం

ఎన్నికల ముందు హడావుడి..



ఎన్నికల ముందు హడావుడిగా ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము విడుదల చేశారు. గత ఏడాది డిసెంబరు రెండో వారంలోనే కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటించింది. ప్రతి ఏడాది ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్ ముగిసిన వెంటనే పరిహారం అందిస్తామని సీఎం జగన్ ఆర్భాటంగా ప్రకటించారు. 2023-24 ఖరీఫ్ పంటనష్ట పరిహారాన్ని సంక్రాంతి పండుగలో ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు పరిహారం విడుదల చేయకుండా జాప్యం చేశారు. తీరా ఎన్నికల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసి, డబ్బు జమ చేయకుండా చేతులు దులుపుకోవడం పద్ధతి కాదు. సీఎం జగన్ బటన్ నొక్కి వారం గడిచినా సొమ్ము జమ కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధిత రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రస్తుత డంపింగ్ యార్డ్

డంపు.. కంపు..!

చెత్త సమస్యకు పరిష్కారం ఎప్పుడు..?

- నగరంలో చెత్త సేకరణ.. నిర్వహణా వైఫల్యం
- విషం చిమ్ముతున్న గుత్తిరోడ్డు డంప్ యార్డు
- బయోమైనింగ్ పేరిట నిధులు మింగేస్తున్నారు
- ఎన్నికల హామీగా మిగిలిపోయిన యార్డ్ తరలింపు

అనంతపురం క్రైం, మార్చి 12: నగర ప్రజలకు డంపింగ్ యార్డ్ సమస్య నరకం చూపుతోంది. అనంతపురం నగరం నానాటికీ విస్తరిస్తుండటంతో సమస్య తీవ్రత పెరుగుతోంది. గుత్తి రోడ్డులో ఉన్న వ్యర్థ పర్వతం పెరగడమేగాని, తరుగుతున్న ఆనవాళ్లు కనిపించడం లేదు. పైగా అప్పుడప్పుడు అక్కడ అగ్నిపర్వతం బద్దలౌతోంది. విష రసాయనాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నగరంలో ఉత్పత్తయ్యే చెత్త మొత్తం అక్కడికే చేరుతోంది. ఏళ్లతరబడి ప్లాస్టిక్, చెత్త, ఇరత వ్యర్థాలు ఒకేచోట ఉంటున్న కారణంగా బయోగ్యాస్ విడుదలై మంటలు వ్యాపిస్తున్నాయి. వేసవిలో ఇది సాధారణమే అని అధికారులు అంటున్నా, పర్యవసానాలు మాత్రం తీవ్రంగా ఉంటున్నాయి. తాజాగా పది రోజుల వ్యవధిలో రెండుసార్లు డంపింగ్ యార్డులో భారీగా మంటలు చెలరేగడం కలకలం రేపింది. ఈ క్రమంలో డంపింగ్ యార్డ్ మార్పు విషయం మరోసారి తెరపైకి వచ్చింది. డంపింగ్ యార్డును మారుస్తామని గత ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. గెలిచి.. పదవీకాలం ముగుస్తున్నా ఆ హామీ నెరవేరలేదు. డంపింగ్ యార్డు చుట్టుపక్కల కాలనీల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న విద్యా సంస్థలను వేరే ప్రాంతాలకు తరలించుకున్నారు.

టన్నులకొద్దీ చెత్త

అనంతపురంలో చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ విషయంలో అధికారులు, పాలకులు విఫలమౌతున్నారు. నగరంలోని 50 డివిజన్ల పరిధిలో రోజుకు 110 టన్నుల నుంచి 140 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇదంతా గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డుకు చేరుతోంది. తడి, పొడిచెత్త వేర్వేరుగా కాకుండా, ఒకే కుప్పగా పడేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా టన్నుల కొద్దీ అందులో ఉంటున్నాయి. మంటలు చెలరేగినప్పుడు విష రసాయనాలు వ్యాపిస్తున్నాయి. వాయుకాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. దీంతో నగరప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల రెండుసార్లు డంపింగ్ యార్డులో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది ఫైరింజన్లతో వెళ్లి రాత్రంతా కుస్తీ పడితేగానీ మంటలు ఆరలేదు.



డంపింగ్‌యార్డ్‌లో మంటలు (ఫైల్)

నిధుల దుర్వినియోగం

డంపింగ్ యార్డ్‌లో బయోమైనింగ్ పేరిట రూ.కోట్ల నిధులు కాజేశారని ఆరోపణలు ఉన్నాయి. పనులు పూర్తి చేయకనే నిధులు చేతులు మారాయని విమర్శలు వచ్చాయి. డంపింగ్ యార్డ్‌లో బయోమైనింగ్ ప్రక్రియకు 2022 చివర్లో శ్రీకారం చుట్టారు. అనంతపురం నగరపాలిక, స్వచ్ఛ ఆంధ్ర భాగస్వామ్యంతో రూ.26 కోట్లతో టెండర్లు పిలిచారు. ఒప్పందం మేరకు 2022 డిసెంబరులో పనులు ప్రారంభించి, 2023 డిసెంబరు నాటికి పూర్తి చేయాలి. కానీ గడువులోగా పనిపూర్తి కాలేదు. కనీసం 60 శాతం పనులు జరగకనే నిధులు విడుదల చేశారనే ఆరోపణలు వచ్చాయి. బయోమైనింగ్ ద్వారా ప్లాస్టిక్, గాజు తదితర వ్యర్థాలను రీ సైక్లింగ్ చేశారు. చెత్త నుంచి ఎరువును తయారు చేశారు. ఆ ఎరువును సైతం విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ ఎరువు ఎవరు, ఎంతకు అమ్ముకున్నారనేది తేలలేదు. వైసీపీలోని కీలక నాయకుల జేబుల్లోకి ఈ సొమ్ము వెళ్లిందని ప్రచారం ఉంది. ఈ విషయంలో మేయర్, డిప్యూటీ మేయర్లు బాహాటంగా అసంతృప్తి వ్యక్తపరిచారు. తమకు తెలియకుండా వ్యవహారాలు నడిపించారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వద్దు బాబోయ్..

డంపింగ్ యార్డు పేరెత్తితేనే సమీప కాలనీల ప్రజలు హడలిపోతున్నారు. గుత్తి రోడ్డులోని డంపింగ్‌యార్డ్ దాదాపు 12 ఎకరాల్లో ఉంది. చుట్టూ ఉంటున్న ప్రజలు ఇప్పటికే నరకయాతన అనుభవిస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో డంపింగ్‌యార్డ్ మార్పునకు ప్రయత్నాలు జరిగాయి. అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లి పరిసర ప్రాంతాల్లో కొన్ని ఎకరాల భూమి అనుకూలంగా ఉందనే నివేదిక ఇచ్చారు. నిధులు కేటాయించే ప్రయత్నాలు జరిగాయి. కానీ ఆ ప్రాంతవాసులు వ్యతిరేకించడంతో ఆ ప్రయత్నానికి బ్రేక్ పడింది. ఆ తరువాత మార్పు దిశగా ప్రయత్నాలు జరగలేదు.

మార్పు జరిగేనా..?

తాడిపత్రి మున్సిపాలిటీలో ఏళ్ల క్రితమే తడి చెత్త, పొడి చెత్త సేకరణ వేర్వేరుగా చేయడం ప్రారంభించారు. కానీ అనంతపురం కార్పొరేషన్‌లో అది ఆచరణకు నోచుకోలేదు. మరోసారి రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర ఆధ్వర్యంలో తాజా చెత్తను వర్మీ కంపోస్టుగా తయారు చేయడానికి సంకల్పించినట్లు తెలుస్తోంది. ఆ మేరకు టెండర్ పిలిచేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. కానీ ఎన్నికలు సమీపించాయి. ఎన్నికల తరువాత కొత్త ప్రభుత్వమైనా చెత్త సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

రాజకీయాలు కాదు.. ప్రజారోగ్యం ముఖ్యం



డంపింగ్ యార్డ్‌లో తరచూ దుర్వాసన వస్తోంది. రాజకీయ ప్రయోజనాల కోసం చూడకుండా ప్రజల ఆరోగ్యాన్ని పాలకులు కాపాడాలి. గతంలో డంపింగ్ యార్డ్ మార్పునకు శింగనమల సమీపంలో స్థలం చూశామన్నారు. కానీ మార్చలేదు. రీసైక్లింగ్ చేస్తామని చెప్పినా పని కాలేదు. తాజాగా మంటలు చెలరేగాయి. ప్రభుత్వం చిత్తశుద్ధిగా పనిచేసి వెంటనే డంపింగ్‌యార్డ్‌ను మార్చాలి. - నాగేంద్ర, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం..

డంప్‌యార్డ్ మార్పు కోసం ప్రయత్నిస్తున్నాం. కొన్నిచోట్ల అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో ఆలస్యమవుతోంది. మరో నెలలో వర్మీ కంపోస్టు తయారీ పనులను ప్రారంభిస్తాం.



- మహమ్మద్ వసీం, మేయర్

కలెక్టర్, ఎమ్మెల్యే చొరవ చూపాలి



డంపింగ్‌యార్డ్ సమస్య చాలాకాలంగా అలాగే ఉంది. గతంలో ఆ ప్రాంతం నగరానికి దూరంగా ఉండేది. నగరం విస్తరించడంతో ఇప్పుడు అక్కడ అభివృద్ధి జరిగింది. మార్కెట్ యార్డ్, విద్యాసంస్థలు, నివాసాలు ఏర్పడ్డాయి. కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు చొరవ చూపి, వెంటనే డంపింగ్‌యార్డ్‌ను వేరే ప్రాంతానికి మార్చాలి. లేదటేపే వ్యాధులతో నష్టం జరిగే ప్రమాదం ఉంది.

- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సాయంత్రం 06:31

సెహరీ : గురువారం ఉదయం 05:12

జాతీయ హాకీ పోటీలకు ఎంపిక



దేవకి, నందిని, భరణి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 12: జాతీయ మహిళా హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన దేవకి, నందిని, భరణి ఎంపికయ్యారు. బుధవారం నుంచి మహారాష్ట్రలోని పుణెలో నిర్వహించే ఈ పోటీల్లో వీరు పాల్గొంటారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

అనంతపురం కల్చరల్, మార్చి 12: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం డీఎం నాగభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రయాణికులు సందేహాలు, ఫిర్యాదుల కోసం సా యం త్రం 4 నుంచి 5 గంటల మధ్య 08554 248553, 99592 25853 ను సంప్రదించాలన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.24 వేలు

అనంతపురంరూరల్, మార్చి 12: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 393 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

17న మూర్ఛవ్యాధి వైద్యశిబిరం

అనంతపురం కల్చరల్, మార్చి 12: స్థానిక జేవీవీ జిల్లా కార్యాలయంలో మూర్ఛవ్యాధి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు జేవీవీ కన్వీనర్ రామకృష్ణ, నగరాధ్యక్షుడు రామిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరంలో విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ శివన్నారాయణ వైద్యపరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి మందులు అందిస్తారన్నారు. బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తండ్రి దాడిలో కొడుకు మృతి

● మద్యం తాగి గొడవ చేస్తున్నాడని ఆగ్రహం



మురళి మృతదేహం

గుంతకల్లుటౌన్, మార్చి12: రోజూ రాత్రి మద్యం తాగి ఇంటికి వస్తున్న కొడుకు ప్రవర్తనపై విసుగెత్తిన తండ్రి క్షణికావేశంలో కొడుకును కడతేర్చారు. గుంతకల్లు రూరల్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని పాతగుంతకల్లు నాగప్ప కట్ట కాలనీలో బోనగల మురళి(28) బేల్దారి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు. మురళి రోజూ మద్యం తాగి తల్లిదండ్రులతో గొడవపడేడు. సోమవారం రాత్రి మురళి మద్యం సేవించి తండ్రి మునిస్వామితో గొడవపడ్డాడు. క్షణికావేశంలో మునిస్వామి బండలు తుడిసే కట్టెతో మురళి తలమీద బాదాడు. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందిన అనంతరం మురళి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం వేకువజామున మురళిని నిద్రలేపగా అతడు లేవకపోవడంతో అతన్ని చికిత్స నిమిత్తం తిరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు మురళికి కొనకొండ్లకు చెందిన గంగోత్రితో మూడేళ్ల క్రితం వివాహమైంది. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

దళితులకు దగా

● నిధులు లేక ఆగిపోయిన భూమి కొనుగోలు పథకం ● ఎస్సీలకు వైసీపీ ప్రభుత్వం మొండిచెయ్యి ● ఐదేళ్లలో ఎకరం భూమీ ఇవ్వని వైనం ● టీడీపీ హయాంలో రూ.12 కోట్లతో 158 మందికి భూపంపిణీ



టీడీపీ హయాంలో అందజేసిన పట్టా పాస్‌బుక్



టీడీపీ హయాంలో పంపిణీ చేసిన సాగు భూమి

విడపనకల్లు, మార్చి 12: వైసీపీ పాలనలో ఎస్సీలకు మొండిచెయ్యి చూపారు. భూమిలేని పేదలు రైతులుగా మారే అవకాశం లేక కూలీలుగానే మిగిలిపోయారు. భూపంపిణీ చేస్తారని ఎదురు చూసిన దళితులు దగా పడినట్లయ్యింది. ఎస్సీల అభ్యున్నతి కోసం టీడీపీ ప్రభుత్వం భూమి కొనుగోలు పథకాన్ని(ఎల్‌పీఎస్) అమలు చేసింది. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద ఉరవకొండ నియోజవర్గాన్ని ఎంపిక చేసింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరు పేద ఎస్సీలకు 2.5 ఎకరాలు నుంచి 3ఎకరాలు సాగు భూమిని కొని ఇచ్చే పథకం ఇది. 75శాతం సబ్సిడీతో భూములను ఎస్సీలకు అప్పగించి, వారిని రైతులుగా మార్చడమే ఈ పథకం ఉద్దేశం. మిగిలిన 25 శాతం మొత్తాన్ని ల బ్ధిదారులు ఐదు వాయిదాలలో ఐదేళ్లలో చెల్లించాల్సి ఉంటుంది. కేంద్రం నిధులు 60శాతం, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ నిధులు 40శాతం కలిపి ఎస్సీలకు భూమిని కొనుగోలు చేసి ఇచ్చేవారు. 2018లో అప్పటి ప్రభుత్వం విడపనకల్లు మండలంలోని వివిధ గ్రామాల ఎస్సీ రైతులకు 158 మందికి ఒక్కొక్కరికి 2.5 ఎకరాల ప్రకారం దాదాపుగా 400 ఎకరాలు భూమిని అందజేసి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. 12 కోట్ల ఖర్చు చేశారు. మొదటి విడత కింద అర్హులైన రైతులకు భూ పంపిణీ చేసింది. రెండో విడతలో భాగంగా రూ. 22 కోట్ల ఖర్చుతో దాదాపుగా 700 ఎకరాలుకు పైగా కొనుగోలు చేసి 230 మందికి పంపిణీ చేసేందుకు పరిపాలన అనుమతులు కూడా పొందారు. అప్పట్లో ఎన్నికల కోడ్ రావటంతో అబ్ది దారుల ఎంపిక అలాగే నిలిచి పోయింది. మరో రూ. 40 కోట్లకు పైగా ప్రతి పాదనలతో 800 మందిని నియోజక వర్గంలో ఎస్సీలను ఎంపిక చేసి మూడవ విడతలోను 15వందల ఎకరాలకు పైగా పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఎస్సీ కార్పోరేషన్‌లో నిధులు ఉండి ఉంటే ఇప్పటికి ఉరవకొండ నియోజక వర్గంలో దాదాపుగా రెండు వేల మందికి పైగా ఎస్సీలకు సాగు భూమి అందేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్పోరేషన్ నిధులు ఖాళీ అయ్యి, అబ్దిదారులుకు నిరాశే మిగిలింది. రెండవ విడతలో లబ్దిదారుల ఎంపిక, పరిపాలన అనుమతులు కూడా పూర్తయినా భూ పంపిణీపై వైసీపీ నా యకులు దృష్టి పెట్టలేదు. ఎస్సీ కార్పోరేషన్‌లో లేవంటూ అధికారులూ దీనిపై దృష్టి పెట్టలేదు. మండలంలోని కొంత మంది వైసీపీ నాయకులు, ఎస్సీలకు భూ పంపిణీ చేస్తామంటూ మాయ మాటలు చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ. 40వేలు నుంచి రూ.50 వేలు వసూళ్ల చేసి నిలువునా మోసం చేస్తున్నారు. అమాయకులైన ఎస్సీలతో అందిన కాడికి దండుకోవటానికి కొంత మంది దళారులు తమ ఇళ్లకు పిలిపించుకొని వేలకు వేలు వసూలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎస్సీ కార్పొరేషన్ నిధులు మొత్తం ఇతర అవసరాలకు మళ్లించటంతో జిల్లాలో భూ పంపిణీ నిలిచిపోయింది. ఫలితంగా ఎస్సీల అభివృద్ధి ఆగిపోయింది. వైసీపీ పాలనలో భూ పంపిణీ చేయక పోగా 2018లో భూమిని తీసుకున్న ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సొమ్ము చెల్లించాలనీ, లేనిపక్షంలో ఇచ్చిన భూములను వెనక్కి తీసుకుంటామని నోటీసులు జారీ చేశారు. భూపంపిణీ చేయకపోగా ఉన్న భూములను లాగేసుకుంటామని హెచ్చరికలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాగుభూమి ఇచ్చింది టీడీపీ ప్రభుత్వమే : గంగన్న, ఎస్సీ రైతు, పాల్తూరు



మా కుటుంబానికి 2018లో టీడీపీ ప్రభుత్వంలో రెండున్నార ఎకరాలు సాగు భూమిని కొని మా పేరున రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. దాదాపుగా రూ. 8 లక్షలు విలువ చేసే భూమిని మాకు అందించి ఆర్థికంగా ఎదిగేందుకు అప్పటి ప్రభుత్వం మాకు భూ పంపిణీ చేసింది. ప్రభుత్వం మారిన తరువాత ఏ దళితుడికీ సెంటు భూమిని కూడా కొని ఇవ్వలేదు. దళితులు కూలీలుగానే మిగిలిపోయారు.

పయ్యావుల కేశవ్ చొరవతోనే.. : మారుతమ్మ, రైతు, విడపనకల్లు



నాకు రెండు ఎకరాల భూమిని ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ చొరవతో అప్పటి ప్రభుత్వం అందించింది. సాగు భూములను వివిధ వర్గాల రైతులతో కొనుగోలు చేసింది. 5 సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుని ఆర్థికంగా కొంత ముందుకు వెళ్తాఉన్నాము. మా పేరున సాగు భూమి ఉండటంతో సమాజంలోను మాకు కొంత గౌరవంగా ఉంది.

రెండో విడతలో ఎంపికైనా భూమి ఇవ్వలేదు : భవాని, విడపనకల్లు



ఎస్సీలకు సాగు భూమలను కొని ఇచ్చే పథకాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొదటి విడతలో కొంత మందికి ఎస్సీలకు భూ పంపిణీ చేశారు. రెండో విడతలోను భూమి పంపి ణీ చేయాలని దాదాపుగా 230 మందిని ఎంపిక చేసి లాటరీ తీశారు. ప్రభుత్వం మారడంతో మాకు భూపంపిణీ నిలిపి వేశారు. 5ఏళ్లుగా ఎదురు చూస్తున్నా భూ పంపిణీ జరపలేదు.

ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నాం : ఓబుళమ్మ, విడపనకల్లు



ఐదేళ్ల ఎస్సీలకు ఒక్క ఎకరం భూమిని కొని ఇవ్వక పోగా కార్పొరేషన్‌లో ఉన్న నిధులు ఖాళీ చేశారు. రెండో విడత భూ పంపిణీ జరుగుతుంది అనుకునే సమయంలో వైసీపీ ప్రభుత్వం దళితులను నిలువునా మోసం చూసింది. రెండో విడతలో మా పేర్లను ఎంపిక చేశారు కానీ ఇప్పటి వరకూ ఎస్సీ కార్పొరేషన్ నుంచి భూమిని కొనుగోలు చేసి ఇచ్చిన పాపాన పోలేదు.

వందేభారత్ రైలుకు ఘన స్వాగతం



వందే భారత్ రైలుకు పచ్చజెండా ఊపుతున్న డీపీఓ యాప్రిల్ అరోరా

గుంతకల్లు, మార్చి12: జిల్లాకు చేరిన కలబురిగి- బెంగళూరు వందే భారత్ రైలుకు అధికారులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు గుంతకల్లు చేరగా, డివిజనల్ అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా రైలును ప్రారంభించగా గుంతకల్లు డీఆర్ఎం మనీశ్ అగర్వాల్ ఆధ్వర్యంలో రాయచూరులోనూ, ఏడీఆర్ఎం సుధాకర్ ఆధ్వర్యంలో గుంతకల్లులోనూ వందే భారత్ రైలుకు స్వాగత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటుచేసి ప్రధానమంత్రి రైల్వే ప్రాజెక్టులను, వందే భారత్ రైళ్లను ప్రారంభించిన వర్చువల్ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ఇన్ని ప్రాజెక్టులు, రైళ్ల ప్రారంభం, మరికొన్ని ప్రాజెక్టులను శంకుస్థాపన చేయడం చారిత్రకమని ఏడీఆర్ఎం సుధాకర్ పేర్కొన్నారు. మధ్యాహ్నం కలబురగి-బెంగళూరు వందేభారత్ రైలు 1వ నెం. ప్లాట్‌ఫారం పైకి రావడంతో బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు, సిబ్బంది పూల వర్షం కురిపిస్తూ ఆహ్వానం పలికారు. అనంతరం డీపీఓ యాప్రిల్ అరోరా పచ్చజెండాను ఊపి రైలును ముందు కు పంపారు. కార్యక్రమానికి నోడల్ ఆఫీసరుగా సీనియర్ డీఎస్‌టీఈ వైపీ సింగ్, కో-ఆర్డినేటరుగా ఆర్ రామస్వామి నాయక్ వ్యవహరించారు. మండలంలోని నక్కనదొడ్డి గ్రామం వద్ద నిర్మించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఇంధన గిడ్డంగులను మంగళవారం లాంఛనంగా జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో ఐఓసీ చీఫ్ డిపో మేనేజరు కే నవీన్ కుమార్, సీనియర్ డీఈఎన్ (కోర్డినేషన్) అక్కి రెడ్డి, ఏఓఎం అమ్రిత్ లాల్ మీనా, చీఫ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ మీనా కుమారి, ఏఓడబ్ల్యూ శివదాస్, సిబ్బంది కేజే సుబ్రహ్మణ్యం, షాజీద్ అహ్మద్, సర్పంచు డీ వరలక్ష్మి, టీడీపీ నాయకుడు బొజ్జేనాయక్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు అనుగుణంగా రైల్వే సేవలు

● రైల్వే డీఎంఈ అజాముద్దీన్
● పెనుకొండలో గూడ్స్ షెడ్డు ప్రారంభం



పెనుకొండలో గూడ్స్ షెడ్డును ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు

పెనుకొండ రూరల్, మార్చి 12 : భారతీయ రైల్వే ఆధునికీకరణలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ రైల్వే రగంలో ప్రయాణికులకు అనుగుణంగా విస్తృత సేవలు అందిస్తున్నారని రైల్వే సీనియర్ డీఎంఈ అజాముద్దీన్ కొనియాడారు. ఒకే దేశం, ఒకే రైల్వేస్టేషన్, ఒకే గూడ్స్ నినా దంతో ప్రధానిమోదీ గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నుంచి రూ.85వేల కోట్ల అంచనాతో పలు రైల్వే ప్రాజెక్ట్ పనులు, పది వందే భారత్ రైళ్లను వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పెనుకొండ రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారుల ఆధ్వర్యంలో పలువురు హాజరై ప్రధాని ప్రసంగాన్ని వీసీలో వీక్షించారు. అనంతరం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎంఈ మాట్లాడుతూ.... ప్రధాని మోదీ హయాంలో రైల్వే రంగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. బెంగళూరు డివిజన్‌లో వేలాది మందికి ప్రయోజనం చేకూర్చే రెండు వందే భారత్ రైళ్లను ప్రారంభించారన్నారు. వీటిలో ఒకటి జిల్లా నుంచి ప్రయాణించడం హర్షణీయమన్నారు. 2021-22లో 9100కియ కార్లు, 2022-23లో 20,300 కార్లను పెనుకొండ రైల్వే స్టేషన్ నుంచే ఇతర రాష్ట్రాలకు తరలించారని తెలిపారు. ఈ ఏడాదిలోనే 16,200 కియ కార్లు ఎగుమతి అయ్యాయన్నారు. అనంతరం గూడ్స్‌షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో పెనుకొండ రైల్వే స్టేషన్ అధికారులు, సిబ్బంది, బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అధ్వానం



హంద్రీ నీవా కాలువలో తగ్గిన నీటి ప్రవాహం



● 22 టీఎంసీల నీరూ ఎత్తిపోయలేదు ● డ్యాంలో కనిష్ఠ మట్టానికి పడిపోయిన నీటి నిల్వ ● ఆగిపోనున్న పంపింగ్

గుంతకల్లు, మార్చి12: హంద్రీనీవాలో ఐదేళ్లతో పోలిస్తే ఈసారి మరీ అధ్వానంగా ఎత్తిపోతలు కొనసాగాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో చివరి సంవత్సరం అత్యంత దిగదుడుపుగా నీటి పంపింగ్ కార్యక్రమం జరిగింది. కనీసం 22 టీఎంసీలు కూడా నీటిని పారించలేకపోయారు. 2020 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ ఏటా హంద్రీనీవాలో ఎత్తిపోతల గ్రాఫ్ పడిపోతూ వచ్చింది. ఈ సంవత్సరం మరీ అధ్వానంగా కనీసం 22 టీఎంసీల స్థాయికి కూడా చేర్చలేకపోయారు. శ్రీశైలం డ్యాంలో నీటి నిల్వలు ఇక ఎత్తిపోతలు సాధ్యంకాని కనిష్ఠ స్థాయికి తగ్గిపోయాయి. రేపో మాపో హంద్రీనీవాలో పంపింగ్ నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.

కనిష్ఠ స్థాయికి ఎత్తిపోతలు

హంద్రీనీవాలో నీటి ఎత్తిపోతలు గత ఐదేళ్లలో ఎప్పుడూ లేనంత తక్కువ స్థాయిలో ఈ సంవత్సరం జరిగాయి. 2020-21 సంవత్సరం మొదలుకుని ఇప్పటిదాకా హంద్రీనీవాలో నీటి పారుదల ఏయేటికాయేడు తగ్గిస్తూ వచ్చారు. 2020-21 సీజన్‌లో హంద్రీనీవాలో నీరు గరిష్ఠంగా 40 టీఎంసీలు పారగా, 2021-22 సీజన్‌లో 25.56 టీఎంసీలకు, 2022-23 సంవత్సరంలో 23.7 టీఎంసీలకు, 2023-24 సంవత్సరంలో ఇప్పటిదాకా 21.13 టీఎంసీలు మాత్రమే పంపు చేయగలిగారు. ఈ లెక్కన 2020-21 సీజన్‌తో పోలిస్తే తర్వాతి సంవత్సరంలో దాదాపు 14.5 టీఎంసీలు, 2021-22 సంవత్సరంలో పోలిస్తే తదుపరి సంవత్సరం దాదాపు 2 టీఎంసీలు, 2022-23తో పోలిస్తే ప్రస్తుతం హంద్రీనీవాకు రెండు టీఎంసీల నీటి కోత ఏర్పడింది. మరో రోజులో నీటి ఎత్తిపోతలు నిలిచిపోనుండగా, కనీసం 22 టీఎంసీల మార్కును కూడా ఈసారి దాటే పరిస్థితులు లేవు. కాగా ఇప్పటిదాకా హంద్రీనీవాకు లభించిన 21.13 టీఎంసీల నీటిలో అనంతపురం జిల్లాలో రాగులపాడు వద్ద ఉన్న 8వ పంపు హౌస్ నుంచి ఎగువకు 13.97 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. కర్నూలు జిల్లాకు 7 టీఎంసీలు లభించాయి.

తగ్గిపోయిన నీటి మట్టాలు

ఎత్తిపోతల పథకాలకు సంబంధించి హంద్రీనీవా డ్యాంలో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయికి చేరుకోవడంతో హంద్రీనీవాలో పారుదల కార్యక్రమం చరమాంకానికి చేరింది. మల్యాల పంప్ హౌస్ వద్ద నీటిని తోడాలంటే డ్యాంలో కనీసం 835 అడుగుల స్థాయిలో నీరుండాలి. జనవరి మొదటి వారంలో డ్యాం మట్టం 835 అడుగుల కంటే తగ్గిపోవడంతో మల్యాల పంపులకు రెస్టిచ్చి, ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉన్న ముచ్చుమర్రి (కేసీ కెనాల్) ఎత్తిపోతల పథకం నుంచి హంద్రీ-నీవాకు తక్కువ మోతాదులో నీటిని అందించారు. అప్పటి నుంచి కేవలం రెండు పంపులను మాత్రమే వాడుతూ హంద్రీనీవాకు అరకొర నీటిని వదిలారు. అది కూడా తొలిదశ కింద ఉన్న కాలువ నుంచి చెరువులకు నీరు వెళ్లకుండా ఆపి, రెండవ దశ కింద ఉన్న జీడిపల్లి ఎగువ కాలువకు నీటిని తీసుకుపోయారు. ముచ్చుమర్రి పథకంలోని అన్ని పంపులకు నీరు అందాలంటే డ్యాంలో కనీసం 814 అడుగుల నీటి మట్టం ఉండాలి. కాగా మూడు రోజుల కిందట ఆ నంబరును దాటి మట్టం పడిపోయింది. దీంతో నీరు అందినకాడికి తక్కువ మోతాదులో పంపుచేస్తూ హంద్రీనీవాకు కూడా నీటిని అందించారు. ప్రస్తుతం 1వ నెంబరు పంపు హౌస్ వద్ద కేవలం ఒక్క పంపు మాత్రమే పనిచేస్తుండగా, దాదాపు 300 క్యూసెక్కుల నీరు ఎగువకు వస్తోంది. ప్రస్తుతం డ్యాంలో 812.4 అడుగుల నీటి నిల్వ ఉంది. ఈ మేరకు ఏక్షణమైనా ముచ్చుమర్రి పంపులు ఆగిపోనున్నాయి. ఇలా హంద్రీనీవా కాలువలో నీటి ఎత్తిపోతల విషయంగా ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడంతో మూడేళ్ల నుంచి ప్రతియేడూ నీటి ప్రవాహ స్థాయి దిగదుడుపుగా మారింది. తెలంగాణాపై పోరాటంలో ఏపీ ప్రభుత్వం మూడేళ్ల నుంచి చేతులు ఎత్తేయడంతో హంద్రీనీవా నుంచి లభించాల్సిన నీటి కోటా రాకుండా పోయింది.



వైవీబీ రాజేంద్ర ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న చాంబర్ నాయకులు

నేడు కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

శింగనమల,మార్చి12: రాష్ట్రంలో సర్పంచుల సమస్యలపై చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జిల్లాలో సర్పంచ్‌ల సమస్యలపై చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనడానికి జాతీయ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ చేరుకున్నారు. ప్రధాన కార్యదర్శులు బిర్రు ప్రతాప్‌రెడ్డి, కొత్తపు మునిరెడ్డిని అనంతపురంలో రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యకార్వాహక కార్యదర్శి డేగలకృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల అధ్యక్షులు గోనుగుంట్ల భూషన్, జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వేలూరు రంగయ్య, ధనుంజయ్‌యాదవ్, సర్పంచులు తిరుపాలు, నిట్టూరు శివాజీ స్వాగతం పలికారు.

దాడి కేసు నమోదు

అనంతపురం క్రైం, మార్చి 12: నగరంలోని లక్ష్మీనగర్ పరిధిలోని పార్వతమ్మకాలనీలో ఓ మహిళపై వైసీపీ శ్రేణులు దాడి చేసిన ఘటనలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతపురం ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో పార్వతమ్మ కాలనీలో సమస్యలపై నిలదీసిందని కొందరు వైసీపీ నాయకులు ఆమెపై దాడి చేశారు. పరస్పర ఫిర్యాదుల మేరకు వేర్వేరుగా కేసు నమోదు చేశారు. ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు దాడి చేసినట్లు లక్ష్మీదేవి ఫిర్యాదులో పేర్కొంది. ఒకరిని లక్ష్మీదేవి కాలితో తన్నిందనే ఫిర్యాదుపై ఆమెపై కేసు నమోదు చేశారు.

హత్య కేసు నిందితుడి అరెస్ట్

అనంతపురం క్రైం,మార్చి 12 : ఎస్కేయూ గెస్ట్ లెక్చరర్ మూర్తిరావ్ హత్య కేసులో నిందితుడైన ఆయన మేనల్లుడు ఆదిత్య శశాంక్‌ను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నగరంలోని ఎల్ఐసీ కాలనీకి చెందిన మూర్తిరావ్ ఈనెల 10వతేదీ రాత్రి జేఎన్టీయూ ఎదుట ఉన్న తన ఇంట్లో హత్యకు గురయ్యాడు. అతన్ని తన మేనల్లుడైన ఆదిత్యశశాంక్ హత్య చేశాడని వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మూర్తిరావ్‌కు ఐదుగురు అక్కచెల్లెళ్లు, ఒక సోదరుడు ఉన్నారు. మూర్తిరావు అందరితోనూ కలుపుగోలుగా ఉండేవాడు. పెద్ద అక్క నాగరత్నబాయి వాళ్లను మాత్రం సరిగా పట్టించుకునేవాడు కాదు. నాగరత్నబాయి కుమారుడైన ఆదిత్యశశాంక్ తిరుపతి ఎస్వీయూనివర్శిలో ఎంటెక్ చేస్తుండగా... ఓ సందర్భంలో తన మేనమామ మూర్తిరావ్ ఎంటెక్ వదిలేసి అనంతపురం రావాలని ఇక్కడ మంచి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. మేనమామ మాటలు నమ్మి ఆదిత్య శశాంక్ అనంతపురం వచ్చాడు. అతని ఉద్యోగం గురించి పట్టించుకోలేదు. అంతేకాకుండా తన మేనమామ వ్యవహార శైలి నచ్చలేదు. అంతా తాను చెప్పినట్లే జరగాలనీ, అంతా అతడి కంట్రోల్‌లో ఉండాలనే భావనతో అణగదొక్కుతున్నాడని మేనమామపై కసి పెంచుకున్నాడు. 10వతేదీ రాత్రి భార్య శోభతో కలిసి మూర్తిరావు జేఎన్‌టీయూ వద్దకు వెళ్లారు. ఇదే అదనుగా భావించి అక్కడ మాటువేసిన ఆదిత్య శశాంక్ కత్తితో పొడిచి విచక్షణారహితంగా హతమార్చాడు. మూర్తిరావు కుమార్తె వైష్ణవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు... వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప... సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం నిఘా వేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సర్కిల్ రోడ్డు సమీపంలో నిందితుడిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి బైక్, హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 12: ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని ఉక్కపోతకు గురై వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ గౌతమి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వడదెబ్బపై అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వడదెబ్బ బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఉపాధిహామీ పనులు జరిగేచోట షేడ్‌నెట్స్, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. వడదెబ్బ తగలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు వివరించాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, ఎస్డీసీ ఆనంద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డ్వామాపీడీ వేణుగోపాల్‌రెడ్డి, డీఈఓ వరలక్ష్మితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

మాజీ మంత్రి పరిటాల సునీత


పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన యువత

అనంతపురంరూరల్, మార్చి 12: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కావాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. మంగళవారం మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీలోని ఆదర్శనగర్, సుందరయ్య కాలనీ, దండోరా కాలనీ, జాకీర్ కొట్టాల ప్రాంతాల్లో జనసేన రాప్తాడు నియోజక వర్గం ఇన్‌చార్జ్ పవన్‌కుమార్, టీడీపీ, జనసేన నాయకులతో కలసి ఆమె బాబు సూపర్-6 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి.. సూపర్-6 పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. అనంతరం నిర్వహించిన సభలో 50 కుటుంబాల నుంచి వంద మంది వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. చింటూ, సుందర్, పవన్, సాయిచరణ్, దని, సన్నీ, చరణ్, అనీల్‌కుమార్, మున్నా, షమీర్, నరేష్, ప్రదీప్, దీపక్, నబిరసూల్, బాబా, చిన్నా తదితరులు పార్టీలోకి చేరారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్త వినోద్‌ను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, జయకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి పాముురాయి రఘు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాముురాయి వెంకటేష్, మండల ఉపాధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, పతకమూరి శ్రీనివాసులు, బొట్టు రామాంజినేయులు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్ : మండలంలోని కందుకూరు గ్రామంలో కీలక వైసీపీ నాయకుడు పూల ఓబిరెడ్డి ఆధ్వర్యంలో 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరాయి. మంగళవారం సాయంత్రం ఆ గ్రామంలో మాజీ మంత్రి పరిటాల సునీత, బాబు సూపర్-6 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎన్ రామన్న, మాజీ ఎంపీటీసీ బండారు వెంకటరాముడు, హరి, కప్పల పరుశురామ్, సాయికిరణ్, సాకేలక్ష్మన్న, విశ్రాంత ఎఎస్ఐ మధు, ఎస్సీగోపాల్, శంకర్‌రెడ్డి, శ్రీకాంత్, వెంకటరామడు, శ్రీరాములు తదితర 40 కుటుంబ సభ్యులు టీడీపీ తీర్థం తీసుకున్నారు.

రాప్తాడు : మండలంలోని పాలచెర్ల గ్రామానికి చెందిన 10 కుటుంబసభ్యులు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. పాలచెర్లకు చెందిన వైసీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వినోద్‌కుమార్, నాగేంద్ర, రాజశేఖర్ రమాదేవి, ఓంకుమార్, లక్ష్మీదేవి, యోగానంద, కృష్ణమ్మ, వెంకటేష్ టీడీపీలో చేరారు. అనంతపురం అరవింద్ నగర్ పరిటాల క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఉన్నత విద్యపై దృష్టి సారించండి

ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీల ప్రదానోత్సవంలో కళాశాల విద్యాశాఖ కమిషనర్

అనంతపురం సెంట్రల్, మార్చి 12: డిగ్రీ పూర్తి చేస్తేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావని, ఉన్నత చదువులపై దృష్టి సారించాలని కళాశాల విద్యా శాఖ కమిషనర్ పోలా భాస్కర్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ అవకాశాలకు ప్రయత్నిస్తూనే ఉన్నత చదవులు అభ్యసించాలన్నారు. నైపుణ్య పెంపుదల, ఇటర్న్‌షిప్, మల్టీడిసిప్లనరీ అంశాలను పాఠ్యాంశాల్లో జోడించామన్నారు. వీటిని విద్యార్థులకు అర్థవంతంగా బోధించేలా జేఎన్‌యూ, సెంట్రల్ యూనివర్సిటీ, ఈఎఫ్ఎల్ వర్సిటీలో శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి, కళాశాల విద్యా శాఖ ఏజీఓ తులసి, ఆర్జేడీ నాగలింగారెడ్డి, ఎస్కేయూ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీరాములు నాయక్, కళాశాల పరీక్షల విభాగాధిపతి డాక్టర్ చలపతి అతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు.. కేరింతలతో ఆనందం వ్యక్తంచేశారు.



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న కమిషనర్, వీసీ, ప్రిన్సిపాల్


విద్యార్థుల ఆనంద హేళ

నేడు టీడీపీ, జనసేన కార్యకర్తల సమావేశం

శింగనమల : మండల టీడీపీ, జనసేన ఉమ్మడి కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ గుత్తా ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శింగనమల దుర్గాంజనేయస్వామి గుడి వద్ద నిర్వహించే ఈ సమావేశానికి టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, ద్విసభ్యకమిటీ సభ్యులు అలంనరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి హాజరవుతారని, కావున టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు.

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి


ఆధ్యాత్మిక బోధనల పుస్తకాలను అందజేస్తున్న ప్రముఖులు

అనంతపురం కల్చరల్, మార్చి 12: హెచ్ఎల్‌సీ కాలనీలోని రామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో భగవాన్ రామకృష్ణ పరమహంస 189వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, వేదపఠనం, అనంతరం భగవాన్ రామకృష్ణ పరమహంస గురుదేవుల పూజ, రామకృష్ణ కథామృత పఠనం, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆధ్యాత్మిక సమావేశంలో చిన్మయామిషన్ ప్రతినిధిస్వామి ఆత్మవిదానంద సరస్వతి పాల్గొన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక బోధనల పుస్తకాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్య బృందం ఆధ్వర్యంలో నగర వీధుల్లో కోలాట ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు కృష్ణశశి, శ్రీధరమూర్తి, వేద్రాద్రి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పంపు సెట్ల వాడకంపై శిక్షణ

అనంతపురంరూరల్, మార్చి 12: రైతులకు ఎనర్జీ ఎఫిషియెంట్ పంపుసెట్ల వాడకంపై విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యుత్ వినియోగం బాగా పెరిగిందని, ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ వాడకం, యూనిట్ల వినయోగం తగ్గించే పద్ధతులను పాటించాలని అన్నారు. బిందు సేద్యం, ఎనర్జీ ఎఫిషియెంట్ మోటార్లు తదితర ఇంధన సమర్థవంతమైన పద్ధతులను పాటించడం మంచిదన్నారు. ఈకార్యక్రమంలో ఈఎస్‌సిఐ సీనియర్ ఫ్యాకల్టీ వి.విద్యాసాగర్, గెస్ట్ ఫ్యాకల్టీ ఎంఎస్ఎన్ శాస్త్రి, శ్రీకాంత్, ఈఈటి రాజశేఖర్, అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్, అనంతపురంరూరల్ ఈఈ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన దగ్గుబాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, మార్చి 12: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాప్తాడు మాజీ ఎంపీపీ దగ్గుబాటి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాదులోని చంద్రబాబు నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



రైతులకు డ్రిప్ పరికరాలు సరఫరా చేయాలి

అనంతపురం అర్బన్ : జిల్లాలో డ్రిప్ మంజూరైన రైతులకు తక్షణమే ఆ పరికరాలు సరఫరా చేయాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక అనంతపురం ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఉద్యాన అధికారులు, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, ఏపీఎంఐపీ ఇంజనీర్లు, సిబ్బందికి నిర్వహించిన టెక్నికల్ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే రైతుల పొలాల్లో పరికరాలు బిగించాలని సూచించారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్, ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు పాల్గొన్నారు.

ఓటేసి ఆశీర్వదించండి

టీడీపీ శింగనమల అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ

నార్పల, మార్చి 12: 'మీ ఇంటి ఆడబిడ్డగా వస్తున్నా.. ఓటేసి ఆశీర్వదించండి'.. అని శింగనమల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని బీ పప్పూరు గ్రామంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్ని కలహాలు, సమస్యలు ఉన్నా... మనమంతా ఒక కుటుంబ సభ్యులమని, ఐకమత్యంతో ముందుకు వెళ్దామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గంలో టీడీపీని భారీ మెజార్టీతో గెలపించి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు గిఫ్ట్‌గా ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆలం వెంకట నరసా నాయుడు, ఆకుల ఆంజనేయులు, రంగారెడ్డి, వెంకటే శ్వరనాయుడు, ఎర్రనాగప్ప, జాఫర్‌వలి, చంద్రబాబు, జనసేన నాయ కులు మురళికృష్ణ, ఈశ్వర్, రామకృష్ణ, మంగళదాము, పాల్గొన్నారు.


బండారు శ్రావణి శ్రీ, ఆలంకు స్వాగతం పలుకుతున్న నాయకులు

దశాబ్దాలుగా సమస్యల తిష్ట

- కనీస సౌకర్యాలకు నోచుకోని నందనం హౌసింగ్ కాలనీ
- రోడ్లు, నీటి సౌకర్యమూ లేదు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


సమస్యలపై వినతిపత్రాన్ని పంపేందుకు సిద్ధమైన కాలనీ ప్రజలు

అనంతపురం రూరల్, మార్చి 12: అనంతపురం రూరల్ మండలంలోని నందనం హౌసింగ్ కాలనీలో దశాబ్దాలుగా సమస్యలు తిష్ట వేశాయి. కాలనీలో కనీస సౌకర్యాలూ లేవు. రోడ్లు, తాగునీరు, మురుగు కాలువలు మొదలుకొని ప్రతి ఒక్కటి ఇక్కడ సమస్యగా మారింది. ఫలితంగా స్థానికులు నిత్యం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఈ కాలనీలో 70 కుటుంబాలు ఉంటున్నాయి. అయితే కాలనీ అనంతపురం రూరల్ పంచాయతీ చివర్లో ఉండటం శాపంగా మారింది. కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయమైంది. అడుగుకో గుంత ఉంది. టిడ్కో ఇళ్ల నిర్మాణంలో భాగంగా పెద్ద వాహనాలని ఇదే దారిపై వెళ్లడం కారణంగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఎనిమిది నెలల కింద రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిసింది. అయితే అది నేటికీ కార్యరూపం దాల్చలేదు. కాలనీలోని మురుగు కాలువలో పంచాయతీ సిబ్బంది చెత్తను తొలగించకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి.. దుర్వాసన వెదజల్లుతోంది. దోమలూ విపరీతంగా పెరిగాయి. ఈ కాలనీలో తాగునీటి సమస్యా ఉంది. ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలోని కాలనీలకు.. ఈ కాలనీ పక్క నుంచే నీటి సరఫరా అవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో నీటి సమస్యను పరిష్కరించవచ్చు. అయితే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు అలా చొరవ చూపకపోవడంతో కాలనీ వాసులు నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారు.


రోడ్డు దుస్థితి, మురుగుకాలువలో పేరుకున్న చెత్త

ఇబ్బందులు పడుతున్నాం..: మల్లికార్జున, స్థానికుడు



మేం ఇక్కడి ఇంటిని నిర్మించుకొని ఆరేళ్లయింది. ఇక్కడికి వచ్చినప్పటి నుంచి ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. నీటి సమస్య తీవ్రంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

రోడ్డుకు మట్టి తోలించా: శివలింగయ్య, కాలనీవాసి



ప్రధాన రోడ్డు అయితే అధ్వానంగా ఉంది. పెద్ద పెద్ద వాహనాలు వెళ్తుండటంతో పెద్ద గుంతలు పడ్డాయి. ప్రయాణం చేయాలంటేనే భయమేస్తోంది. చేసేదేమిలేక నా సొంత ఖర్చుతో రోడ్డుకు మట్టిని తోలించాను. అది కూడా పోయింది.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు: మమత, కాలనీవాసి



స్థానిక సమస్యలపై పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నాం. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇంటి నిర్మాణాలకు పంచాయతీ అధికారులు చలానాలు కట్టించుకునే అనుమతులు ఇచ్చారు. ఇంటి పన్ను, నీటి పన్ను కడుతూనే ఉన్నాం. అయినా సౌకర్యాలు కల్పించడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధిని కలిసేందుకు సిద్ధమయ్యాం.

హోదా ప్రకటించాకే.. మోదీ రావాలి..

అనంతపురం న్యూటౌన్, మార్చి 12: ప్రధాని నరేంద్ర మోదీ మొదట ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించాలని, ఆ తర్వాతే రాష్ట్రంలో నిర్వహించే సమావేశంలో పాల్గొనాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఏ ఒప్పందంతో రాష్ట్రంలో మూడు పార్టీలు పొత్తు కుదుర్చుకున్నాయో బహిర్గతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కలయిక ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు దాదాగాంధీ, జిల్లా ఉపాధ్యక్షుడు వాసు పాల్గొన్నారు.

పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

అనంతపురం కల్చరల్ : ప్రజల ఐక్యతను దెబ్బతీసేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకురావడాన్ని అందరూ వ్యతిరేకించాలన్నారు. ఈ మేరకు మంగళవారం క్లాక్‌టవర్ వద్ద చేపట్టిన నిరసనలో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడారు. వివక్ష పూరిత చట్టం అమలుకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసిందని, ఇది ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, నగర కమిటీ నాయకులు బాలకృష్ణ, నాగరాజు, గఫూర్, వెంకటేష్, లక్ష్మీనారాయణ, బాబా, ఎర్రిస్వామి, శంషాద్, రవి, ఆనంద్ పాల్గొన్నారు.

వ్యాపారి ఆత్మహత్య కేసులో దంపతులకు రిమాండ్

అనంతపురం క్రైం, మార్చి 12: నగరానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పెద్దన్న.. ఈ జనవరి 24న నగరంలోని రాజధాని లాడ్జి ఎదుట ఉన్న ఓ గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. రాజధాని లాడ్జి యజమాని నరసింహులు తన ఆత్మహత్యకు కారణమని సూసైడ్ నోట్‌లో రాశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన టూటౌన్ పోలీసులు మంగళవారం ఆ లాడ్జి యజమాని నరసింహులు, భార్య ఉమామహేశ్వరిని అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు పంపారు.

జూదరుల అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి 12: నగరంలోని నాల్గో రోడ్డులోని ఓ ఇంట్లో జూదమాడుతున్న 11 మందిని త్రీటౌన్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.15,200 స్వాధీనం చేసుకున్నారు.

నార్పల : నార్పలలో ఆరుగురు మట్కా రాయుళ్లను మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వారినుంచి రూ.8300 స్వాధీనం చేసుకొని.. కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూటమితోనే మహిళా సాధికారత: జనసేన


మహిళలతో సమస్యలు తెలుసుకుంటున్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 12: జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి పార్టీలతోనే మహిళా సాధికారత సాధ్యమని జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా 43వ డివిజన్‌లో పర్యటించి మహిళలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెండ్యాల శ్రీలత మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం మహిళల ఆర్థిక పురోగాభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేసి వారి సాధికారతను సీఎం జగన్ దెబ్బతీశాడన్నారు. జగనన్న పాలవెల్లువ ద్వారా మహిళలకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

గందరగోళంగా 'ఏడీసీసీ' పాలకవర్గ సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 12: స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశం గందరగోళంగా సాగింది. కరువుతో అల్లాడుతున్న రైతులకు బ్యాంక్ అండగా ఉండాల్సింది పోయి.. పంట రుణాల వసూళ్లపై ఒత్తిడి పెంచాలని బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత అధికారులను ఆదేశించడం పలు విమర్శలకు తావిచ్చింది. కొందరు పాలకవర్గ సభ్యులు రుణాలు రికవరీ చేయాలన్న వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఇంత తంతు జరుగుతున్నా సమావేశంలో కీలక అధికారిగా ఉన్న ఏడీసీసీ బ్యాంకు సీఈఓ ఏబీ రాంప్రసాద్ మిన్నకుండిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు జనార్ధన్‌రెడ్డి, హైదర్‌వలీ, రామాంజినేయులు, రమణమూర్తి, జీఎం సురేఖరాణి, డీజీఎం సుఖదేవబాబు, ఆప్కాబ్ డీజీఎం సురేంద్ర, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

బలిజసేన రాప్తాడు అధ్యక్షుడిగా రాము

రాప్తాడు: బలిజసేన రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా రాప్తాడు మండలం బండమీదపల్లికి చెందిన మందాల రామును ఎంపిక చేసినట్లు బలిజసేన వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బలిజసేన అభివృద్ధికి కృషి చేస్తానని మందాల రాము అన్నారు.

పెరిగిన కాశీవిశ్వేశ్వరుడి హుండీ ఆదాయం

అనంతపురం కల్చరల్ : స్థానిక మొదటి రోడ్డులోని కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయం ఆదాయం రూ.3.44 లక్షలు పెరిగింది. యేటా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం హుండీ ఆదాయ లెక్కింపు చేపట్టడం ఆనవాయితీ. ఈ ఏడాది ఉత్సవాల అనంతరం మంగళవారం ఆలయ కార్యనిర్వహణాధికారి సాకే రమేష్‌బాబు అధ్యక్షతన దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.7,77,464 ఆదాయం వచ్చింది. గతేడాది రూ.4,32,857 ఆదాయం వచ్చింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.3,44,607 అదనంగా ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు సురేష్‌బాబు, వెంకటస్వామి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


మక్కినవారిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న పరిటాల సిద్ధార్థ


ముష్టికోవెలలో టీడీపీ శ్రేణుల ప్రచారం

ఉత్సాహంగా టీడీపీ ఇంటింటి ప్రచారం

రామగిరి : మండలంలోని మక్కిన వారిపల్లి, గంగంపల్లి, గంగంపల్లి తండా, రామగిరి కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని పరిటాల సిద్దార్థ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, మాజీ ఎంపీపీ పరందామ యాదవ్, తెలుగు యువత మండల అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు వెంకటేష్, చిత్తరంజన్, రామలింగ, నాగరాజు, ఆనందప్ప, యల్లప్ప, బొమ్మయ్య, ఎస్సీ సెల్ పోతన్న, కేసీ పణికుమార్, రమేశ్, ప్రభాకర్, విజయ్ కుమార్ నాయక్, ఓబుళపతి, రఘురాం, సుధాకర్, గంగాధర్, గుర్రంశీన, శివకుమార్, విశ్వనాథ్, నాగేశ్, క్రాంతి పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు ఆధ్వర్యంలో మండలంలోని ముష్టికోవెల పంచాయతీలో మంగళవారం సూపర్‌సిక్స్ పథకాలపై ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అంకే అమరేంద్ర, ఎజ్జే శంకర్, రామసుబ్బమ్మ, ముత్యాలప్ప, ప్రసాదమ్మ, రామకృష్ణారెడ్డి, మాడెం సూర్యనారాయణరెడ్డి, నరసింహులు, వెంకటేశ్, అక్కులప్ప, చిరంజీవి, సాయిమనోజ్, మల్లికార్జున, వెంకటేశులు, వినోద్, చలపతి, రామాంజినేయులు, శివ, రామాంజి, కోళ్లసూరి, సావిత్రి, అస్మత్‌బీ, పోతన్న, రాజు, రమేశ్, ఈడిగ భార్గవగౌడ్ పాల్గొన్నారు.

అనంతపురంరూరల్ : మండలంలోని రుద్రంపేట పంచాయతీ పరిధిలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో సూపర్-6 పథకాలపై క్లస్టర్ ఇన్‌చార్జ్ గోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం ప్రచారం చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ.. పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్‌లు బోయపాటి బాలప్పనాయుడు, వడ్డే మురళీకృష్ణ, గంగవరం అంజి, బిఎల్‌ఏ జూటూరు వెంకటేశులు, శివ, వెంకటేశ్వర్లు, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని ముట్టాల గ్రామంలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజి, జిల్లా టీడీపీ నాయకులు పరిటాల శ్రీనివాసులు, ఎంపీటీసీ పారిజాతమ్మ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, మాజీ కన్వీనర్లు లింగన్న వేణుగోపాల్, సూరి, వెంకటనారాయణ, నాయకులు శ్రీనివాసరెడ్డి, రవీంద్రారెడ్డి, రాజారమేష్, పూల ఓబులపతి, వెంకటేసులు, అక్కులన్న, ఆనంద్, సుధాకర్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.



రుద్రంపేట, ముట్టాలలో టీడీపీ నాయకుల ప్రచారం

దాదులూరు పరుష ప్రారంభం



ధర్మవరంరూరల్, మార్చి 12: కనగానపల్లి మండలంలో మూడు రోజులపాటు నిర్వహించే దాదులూరు పోతలయ్యస్వామి పరుషను ప్రారంభించారు. తొలి రోజైన మంగళవారం పోతలయ్య స్వామికి విశేష అలంకరణ చేశారు. బిజారీ వంశీయులు స్వామికి ఎలవగంపలో తెచ్చిన ఆభరణాలు, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంలో ఆలయంలోని చెన్నకేశవస్వామి, బంగారు లింగమయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా మాఘమాసం అనంతరం ఈ జాతరను నిర్వహిస్తారు. ఈ జాతరకు జిల్లానలుమూలల నుంచే కాక కర్ణాటక నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. జాతర మహోత్సవంలో భాగంగా బుధవారం జ్యోతులబోనాలు, ఎడ్ల ప్రదర్శన, గురువారం గావుల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వహకులు తెలిపారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలి

బుక్కరాయసముద్రం, మార్చి 12: మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మండ్లనాగేష్ అన్నారు. మంగళవారం బుక్కరాయసముద్రం పరిధిలోని విద్యుత్ కళాభారతి కల్యాణ మండపంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా మత్స్యకారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. చేపలను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని, అనేక చోట్ల మార్కెట్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శీనునాయక్, ఎఫ్‌డీఓ ఫక్కీరప్ప, మత్స్యకారుల సంఘం జిల్లా ఉపాధ్యాక్షుడు వెంకటనారాయణ, డైరెక్టర్లు సూర్యనారాయణ, పోతకుంట వెంకటేశు, రాజ్‌కుమార్, బాలకృష్ణ, రాజేష్‌నాయక్, గోవిందప్ప పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్

అధికారులకు బినామీగా కాంట్రాక్టర్ సుధాకర్ రెడ్డి



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఓబులు, కార్మికులు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 12: శ్రీరామ్‌రెడ్డి వాటర్ కాంట్రాక్టర్ సుధాకర్ రెడ్డి అధికారులకు బినామీగా వ్యవహరిస్తున్నాడని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ఆరోపించారు. మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నేలపై కూర్చుని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి కాంట్రాక్టర్ కాదని ఆయనకు ఎక్కడ కూడా పనిచేసిన అనుభవం లేదన్నారు. అధికారులకు బినామీగా వ్యవహరిస్తూ శ్రీరామి రెడ్డి నీటి పథకం కార్మికులకు జీతాల్లో కోతలు విధించడం దుర్మార్గమన్నారు. రూ.16500 జీతం అనైతికంగా ప్రవర్తిస్తూ రూ.3 వేలు కార్మికుల జీతాల్లో కోత విధించడం వారి పొట్టకొట్టడమే అన్నారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

యల్లమ్మ తల్లిని దర్శించుకున్న అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 12: పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో ఉన్న యల్లమ్మ తల్లిని మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్ రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు.



అమ్మవారికి పూజలు చేయిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అందరిని పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని యర్రగుంటపల్లి, అక్కన్నపల్లి గ్రామాల్లో అభిమానులు ఏర్పాటుచేసిన విందు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు: పట్టణంలోని కాల్వగడ్డలో ఉన్న మసీదులో రంజాన్ మాసం పురస్కరించుకొని మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు ఆయనకు శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ముస్లింలకు స్వయంగా వడ్డించారు.

'బాధిత కుటుంబానికి అండగా ఉంటాం'

పామిడి, మార్చి 12: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో నివాసం ఉంటున్న ఓబులేసు వడదెబ్బకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబాన్ని మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ మంగళవారం పరామర్శించారు.



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న గుమ్మనూరు నారాయణ

అధైర్య పడవద్దని.. అండగా ఉంటామని మృతుడి భార్య గోవిందమ్మ, కుమారుడు వంశీకృష్ణకు మనోధైర్యం నింపారు. ఎలాంటి సహాయం కావాలన్నా సంప్రదించవచ్చని సూచించారు. కుటుంబ జీవనం కోసం రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌చౌదరి, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, టీడీపీ నాయకులు తిమ్మప్ప, రాము, రామప్ప, చిరంజీవి, సురేష్, ఓబులేసు, చంద్ర, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలును మేనిఫెస్టోలో చేర్చండి

డీ.హీరేహాళ్, మార్చి 12: పాత పెన్షన్ అమలును రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మన ఓటు మన భవిష్యత్తు ఓట్ ఫర్ ఓపీఎస్ పుస్తకాలను విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సహాయకుడు నాగరాజు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మోహన్‌బాబు, రామాంజనేయులు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో సీపీఎస్ రద్దు చేస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఆయన పదవీకాలంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోయారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో పాత పెన్షన్ విధానం అమలు చేసే వారికే ఉద్యోగులు ఓట్లు వేస్తారన్నారు. యూటీఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు హనుమంతప్ప, మండల సహాధ్యక్షులు రామచంద్రప్ప, వెంకోబ్రావ్, లోకాభిరాం, శ్రీనాథ్, కాశీనాథస్వామి, హరి, సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకలు జీఎన్ హనుమంతప్ప, అయ్యన్న, బసవరాజు, ఇరాలప్ప, ఉపాధ్యాయులు రమేష్, నాగరాజు, ఉరుకుందప్ప పాల్గొన్నారు.

కౌన్సిలర్‌పై కేసు నమోదు

తాడిపత్రిటౌన్, మార్చి 12: పట్టణంలోని 30వ వార్డు టీడీపీ కౌన్సిలర్ మల్లికార్జునపై మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీపీఐ కాలనీకి చెందిన ఒక యువతి కౌన్సిలర్ మల్లికార్జున తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యంపై...

కళ్యాణదుర్గం, మార్చి 12: పట్టణంలో ఓ బాలిక కనబడకుండా పోవడంపై మిస్సింగ్ కేసు నమోదు చేశామని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. బాలిక ఆచూకీ, కేసు ఛేదించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపామన్నారు. టెక్నాలజీని ఉపయోగించి గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదన్నారు. త్వరలోనే ఆ అమ్మాయి ఆచూకీ కనుగొంటామన్నారు. పోలీసులు స్పందించలేదని సదరు బాలిక తల్లి సోషల్ మీడియాలో చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

పామిడిలో చోరీ

పామిడి, మార్చి 12: ఇంటికి తాళం వేసిన రెండు ఇళ్లు, ఒక అంగడిలో సోమవారం రాత్రి చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, బాధితుల వివరాల మేరకు.. పట్టణంలోని వెంగమనాయుడు కాలనీలో నివాసం ఉంటున్న చంద్రశేఖర్ అంగడికి తాళం వేసి ఇంట్లో నిద్రించాడు. అంగట్లోని రూ. 30వేలు నగదు అపహరణకు గురైందన్నారు. అదే కాలనీలో నివాసం ఉంటున్న బాబావలి, సుధాకర్ తమ ఇళ్లకు తాళం వేసి ఉంది. ఆ ఇళ్లల్లోకి చొరబడిన దొంగలు బీరువాలోని దుస్తులు ఇష్టారాజ్యంగా పడేసి బాబావలి ఇంట్లో బంగారు కమ్మలు, వెండి ఉంగరం, సుధాకర్ ఇంట్లో రెండు జతల వెండి గొలుసులు దొంగలించినట్లు బాధితులు వాపోయారు. పోలీసులు ఆ ఇళ్లను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో కేబుల్ వైర్ దొంగలు

గుత్తి, మార్చి 12: గుంతకల్లు నియోజకవర్గంలోని ఓబుళాపురం గ్రామంలో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ కేబుల్ వైర్‌ను ఆటోలో తరలిస్తుండగా ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక లచ్చానుపల్లి రోడ్డులో మంగళవారం వైరును తరలిస్తున్న ఆటోను, ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కేబుల్ వైర్ బండళ్లను ఆటోలో సబ్‌స్టేషన్ వద్ద నుంచి తరలిస్తుండగా సమాచారం మేరకు పోలీసులు అదే గ్రామానికి చెందిన చెన్నరాయుడు, లాలెప్ప అనే యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 12: అక్రమంగా తరలివస్తున్న కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్నారనే సమాచారంతో సెబ్ సీఐలు వెంకట్, వెంకటలక్ష్మి దాడులు నిర్వహించి 1344 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కళ్యాణదుర్గం మండలం ఉప్పొంక గ్రామ సమీపంలో తిప్పేస్వామి అనే వ్యక్తిని, పాల వెంకటాపురం గ్రామం వద్ద లక్ష్మన్న, వీరారెడ్డిలను అదుపులోకి తీసుకుని సబ్ స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మేకపై చిరుత దాడి

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 12: మండలంలోని కుర్లపల్లిలో మేకపై చిరుతదాడి చేసి చంపేసింది. రైతు రామ్మూర్తి తెలిపిన వివరాల మేరకు తన వ్యవసాయ పొలంలో ఉన్న మేకపై చిరుత మంగళవారం తెల్లవారుజామున దాడిచేసింది. సమీపంలోని ఉన్న రైతు, కుక్కలు అరవడంతో చిరుత పొలంలోకి పరుగులు తీసిందన్నారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మేకకు పశువైద్యులతో పోస్ట్‌మార్టమ్ చేయించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గుత్తి, మార్చి 12: పట్టణంలోని లచ్చానుపల్లి రోడ్డులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి వెంకటేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ శివసాగర్ తెలిపారు. ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ట్రాక్టర్ నిర్వాహకుడు వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉంతకల్లులో మెజార్టీ తెచ్చుకోగలవా?

● మెట్టు గోవిందరెడ్డికి కాలవ సవాల్

బొమ్మనహాళ్, మార్చి 12: వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సొంత గ్రామమైన ఉంతకల్లులో మెజార్టీ తెచ్చుకోగలవా అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సవాల్ విసిరారు. మండలంలోని ఎల్‌బీనగర్‌లో మంగళవారం శంఖారావం సభను నిర్వహించారు. సభకు కాలవ శ్రీనివాసులుతో పాటు జనసేన ఇన్‌చార్జి మంజునాథగౌడ్, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి పాల్గొన్నారు. కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ ఎన్నికలు సమర్థునికి, అసమర్థునికి, పనిచేసేవారికి, పనికిమాలిన వానికి జరిగే యుద్ధమన్నారు. ఉంతకల్లు గ్రామంలోనే మెట్టు గోవిందరెడ్డి మెజార్టీ తెచ్చుకోలేడని వ్యాఖ్యానించారు. ఆ గ్రామం నుంచి మెట్టును ఉరికిస్తారన్నారు. వట్టి మాటలు తప్ప ఎందుకు పనికిరాని మెట్టుకు ఎమ్మెల్యే పదవి అవసరమా.. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ, ఏపీఐఐసీ చైర్మన్‌గా పదవులు అనుభవించిన ఆయన సొంత గ్రామంలో పదిమందికైనా ఉపాధి కల్పించాడా అని ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తల శక్తి ముందు వైసీపీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తట్టుకోలేరనిఅన్నారు. తొమ్మిది సార్లు కరెంటు బిల్లు, నిత్యావసర ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారని విమర్శించారు. బాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. టీడీపీ మండల కన్వీనర్లు బలరాంరెడ్డి, హనుమంతరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ చంద్రహాస్, కేశవరెడ్డి, వాణిజగన్నాథ్‌రెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, ఎర్రగుంట్ల వెంకటేశులు, ముల్లంగి నారాయణస్వామి, కొత్తపల్లి తిమ్మరాజు, మాలపాటి ధనుంజయ, పయ్యావుల మోహన్, పయ్యావుల అనిల్, పయ్యావుల నాగరాజు, మాజీ డైరెక్టర్ మహేంద్ర, ఉప్పరహాళ్ స్వామి, వన్నారెడ్డి, మల్లీడు శీన, మాజీ కన్వీనర్ చలపతి, జనసేన కన్వీనర్ శివరాజ్, బీజేపీ నాయకులు ఎర్రిస్వామి, మాజీ ఎంపీపీ షణ్ముఖయ్య, కావలి రాము, ముల్లంగి భాస్కర్, ప్రభు, నవీన్, కేశప్ప, సంగప్ప పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

బలిజల అభివృద్ధికి కృషి: అమిలినేని



సురేంద్రబాబును సన్మానిస్తున్న బలిజ సంఘం నాయకులు

కళ్యాణదుర్గం, మార్చి 12: బలిజ సామాజిక వర్గం అంటే నాకు ప్రత్యేక గౌరవం ఉంది, ఈ ఎన్నికల్లో వారంతా నాకు అండగా నిలిచి గెలిపిస్తారనే నమ్మకం ఉందని అమిలినేని సురేంద్ర అన్నారు. మంగళవారం పట్టణంలోని బలిజ సంఘం కమ్యూనిటీ హాల్‌లో జరిగిన బలిజల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనసేన నాయకుడు లక్ష్మీపతితో పాటు జిల్లా కార్యదర్శులు సంజీవ రాయుడు, నగర ఉపాధ్యక్షులు గ్రంధి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, నాయకులు వెన్నెల కృష్ణ, మధు తదితరులు హాజరయ్యారు. స్థానిక బలిజ సంఘం నేతలు బట్నా తిమ్మరాజు, లక్ష్మీ నరసయ్య, వెంకటలక్ష్మయ్య, కృష్ణమూర్తి, ముప్పూరు దేవరాజు, కట్టారాము, మల్లికార్జున, గాజుల రాఘవేంద్ర, పాండురంగ తదితరులు సభలో పాల్గొని అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబును ఘనంగా సన్మానించారు. సురేంద్రబాబు మాట్లాడుతూ మీలో ఒకడిని అధికారంలోకి వస్తే ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆత్మీయ సమావేశానికి హాజరైన వందలాది మంది మాట్లాడుతూ టీడీపీని వెన్నంటి వుంటామని సురేంద్రబాబును గెలిపిస్తామని అన్నారు.

నాయీబ్రాహ్మణులను ఆదుకుంది టీడీపీనే

నాయీ బ్రాహ్మణులను ఆదుకున్నది తెలుగుదేశం పార్టీనేనని అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఆపద వస్తే అండగా ఉంటానని జరగబోయే ఎన్నికల్లో మీరు ఆశీర్వదించి శాసనసభకు పంపిస్తే అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మంగళవారం నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయనముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులను ఆదుకున్న ఘనత టీడీపీకే దక్కిందన్నారు. వారికి వృత్తి పరికరాలు సబ్సిడీ ఇచ్చి ఆర్థికంగా చేయూతనిచ్చిన టీడీపీకే పట్టం కట్టాలన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానని, స్థానికంగా నివాసం కూడా ఏర్పాటు చేసుకున్నానన్నారు. సంఘం సభ్యులు వారి సమస్యలను వినతి పత్రం రూపంలో సురేంద్రబాబుకు అందజేశారు. అందుకు తక్షణమే స్పందించి త్యాగరాజు భవన మరమ్మతుకు రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రకటించారు.



మాట్లాడుతున్న సురేంద్రబాబు

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరిక



పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంరూరల్, మార్చి 12: వైసీపీకి రాయదుర్గం మండలంలో ఎదురు దెబ్బ తగిలింది. చదం, ఆవులదట్ల గ్రామాలకు చెందిన 47 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. మంగళవారం మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు నివాసంలో వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చదం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు ఆనంద్ రెడ్డి, ఆనంద్, కొల్లారప్పతో పాటు 36 కుటుంబాలు, ఆవులదట్ల గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు రామస్వామి, క్రిష్టప్ప, శివారెడ్డితో పాటు 11 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ స్థానిక నాయకులతో పాటు మీరు కూడా కష్టపడి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. మండల కన్వీనర్ హనుమంతు, కాటా వెంకటేశులు, ఆవులదట్ల సర్పంచ్ వన్నూరుస్వామి, జుంజురంపల్లి సర్పంచ్ వన్నూరుస్వామి, ప్రసాద్, సోమశేఖర్, వీరేష్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని హరేసముద్రం, గౌనూరు గ్రామాలకు చెందిన వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ నాయకులు ముల్లంగి నారాయణస్వామి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీ కండువాలు వేయించుకున్నారు. మంగళవారం ఎల్‌బీనగర్‌లో జరిగిన శంఖారావం సభలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బలరాంరెడ్డి, ధనుంజయ, మోహన్, ఎస్పీ నాగరాజు, ఎర్రగుంట్ల వెంకటేశులు, ముల్లంగి భాస్కర్, రాము, గోవిందు, తిప్పేస్వామి, శీన, సంగప్ప పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

టీడీపీతోనే అభివృద్ధి: కేశవ్

కూడేరు: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. మండలంలోని కరుట్లపల్లి గ్రామ దళితవాడకు చెందిన మాజీ సర్పంచు, వైసీపీ నాయకుడు రామాంజనేయులు మరికొందరు మంగళవారం టీడీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సూరప్ప, ఓబులేసు, రమేష్, నాగయ్య, ఆంజినేయులు, నారాయణ, సర్థన్న, దివాకర్, ఓబులపతి, సాయికుమార్, నారాయణ ఉన్నారు.

టీడీపీతోనే భావితరాల భవిష్యత్తు

కళ్యాణదుర్గం: టీడీపీ అధికారంలోకి వస్తేనే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మంగళవారం తెల్లవారుజామున మార్నింగ్ వాక్ చేస్తూ పట్టణంలోని పలు కాలనీల్లో ఆయన కలియతిరిగారు. టీ సర్కిల్, వాల్మీకి సర్కిల్‌లో రోడ్లను శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికుల వద్దకు ఆయన వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చి, కార్మికులకు నమస్కరించి టీడీపీకి మద్దతివ్వాలని విన్నవించారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద శెట్టూరు మండలం ఎర్రబోరేపల్లికు చెందిన 24 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ పార్టీలోకి చేరారు. వారందరికీ అమిలినేని పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.



బొమ్మనహాళ్‌లో టీడీపీ కండువా వేస్తున్న కాలవ



టీడీపీలోకి చేరిన వారితో విక్టరీ గుర్తు చూపుతున్న అమిలినేని

విశ్వేశ్వరరెడ్డికి ఓటు వేయవద్దు

● సీపీఎం మాజీ నాయకుల తీర్మానం

ఉరవకొండ, మార్చి 12: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి వ్యతిరేకంగా పనిచేయాలని సీపీఎం మాజీ నాయకులు తీర్మానం చేశారు. పట్టణంలోని వాల్మీకి కల్యాణ మండపంలో మంగళవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. 2004 నుంచి నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థిగా విశ్వేశ్వరరెడ్డి పోటీ చేశారని, ఆసమయంలో నక్సలైట్ల ప్రభవం కొనసాగుతున్నప్పటికీ, ఆ ఎన్నికల్లో ఆయనకు మద్దతుగా ప్రచారం చేశామన్నారు. ఆయన ఏ పార్టీలోకి వెళ్లినా తాము ఆయన వెంటే ఉన్నామన్నారు. కమ్యూనిస్టు పార్టీ నుంచి వచ్చినా పేదలను పట్టించుకోలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఆయన ఓటమే ధ్యేయంగా గ్రామాల్లో ప్రచారం చేస్తామన్నారు. సీపీఎం మాజీ నాయకులు రాజశేఖర్, సాదిక్, గందోడి నారాయణస్వామి, కూర్మన్న, పెద్దన్న, పందికుంట రామాంజనేయులు, తిమ్మయ్య, ఖాజా, చక్రధర్, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థులకు బహుమతులు

గుత్తి, మార్చి 12: పట్టణంలోని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి మోడల్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం బహుమతులను అందజేశారు. కోట వీధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఇటీవల మోడల్ పరీక్ష నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సుభాన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డాక్టర్ శాంతిప్రియ పాల్గొని విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, ఉపాధ్యాయులు నాగరాజు, నగేష్, రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు మధు, బాలు పాల్గొన్నారు.

వెండి పంచకలశం బహూకరణ

రాయదుర్గంరూరల్, మార్చి 12: గుమ్మఘట్ట మండలం ఎస్ కొత్తపల్లి గ్రామానికి చెందిన మద్దానప్ప కుటుంబసభ్యులు మద్దానేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు బసవరాజుకు వెండి పంచకలశాన్ని బహూకరించారు. సామిఇ జాతర సందర్భంగా ఎస్ కొత్తపల్లి గ్రామానికి చెందిన మద్దానప్ప, కుమారుడు లోకేష్ కుటుంబసభ్యులతో కలిసి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ఆలయ ధర్మకర్త మండలి అధ్యక్షుడికి రూ.1.16 లక్షలు విలువ చేసే వెండి పంచకలశాన్ని అందించారు.

హాకీ పోటీల్లో దుర్గం విద్యార్థుల ప్రతిభ

కళ్యాణదుర్గం, మార్చి 12: ఆంధ్రప్రదేశ్ 14వ హాకీ సీనియర్ ఉమెన్స్ (అండర్ 19) అంతర్ జిల్లా పోటీలు ప్రకాశం జిల్లా మైనంపాడులో జరిగాయి. పోటీల్లో అనంతపురం జిల్లా మూడవ స్థానం దక్కించుకున్నారు. అందులో ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు వైష్ణవి, అఖిల ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థినులను తీర్చిదిద్దిన పీడీ జయరామప్పను ప్రిన్సిపాల్ డి జయరామిరెడ్డి అభినందించారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కే శ్రీధర్, అధ్యాపకులు జ్యోత్స్న, పరమేష్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

ఉరవకొండ, మార్చి 12: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని ఎంపీడీవో అమృత్‌రాజ్ అన్నారు. పట్టణంలో మంగళవారం ఓటుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యలయం నుంచి టవర్‌క్లాక్ వరకూ ర్యాలీ కొనసాగింది. డీటీ హరిప్రసాద్, ఎంఈవో రమాదేవి, ఆర్ఐ రామకృష్ణ వీఆర్వోలు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. డీటీలు పీరా, హరిప్రసాద్ పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని ఆవులదట్ల గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు వెలుగు ఏపీఎం జైచంద్ర తెలిపారు. మంగళవారం గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటుహక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలన్నారు.

బాల్య వివాహాలు నేరం: పీడీ

కూడేరు, మార్చి 12: బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి అన్నారు. స్థానిక కేజీబీవీని మంగళవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు వివరించారు.



మాట్లాడుతున్న పీడీ శ్రీదేవి

చేనేతలకు అండగా ఉంటాం: కేశవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మార్చి 12: చేనేత కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. పట్టణంలోని దేవాంగ ఫంక్షన్ హాల్‌లో చేనేత కార్మికుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే చేనేత రంగాన్ని అన్ని విధాల ఆదుకున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం చేనేతను నిర్వీర్యం చేసిందన్నారు. నేసిన చీరలకు కూలీలు కూడా గిట్టుబాటు కావడం లేదన్నారు. అనంతరం చేనేత సమస్యలపై కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు. చేనేత ముడి సరుకులపై ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించాలని, ప్రతి చేనేత కుటుంబానికి 200యూనిట్ల ఉచిత విద్యుత్ ను ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేనేతకు సంబంధించిన పథకాలను వర్తింపచేస్తామన్నారు. టీడీపీ చేనేత విభాగం నాయకులు వేల్పుల శ్రీనివాసులు, గన్నే లక్ష్మీనారాయణ, కొమ్మసాని బాలచంద్ర, కాశీనాథ్, నిమ్మల ప్రసాద్, ముక్కర బాలచంద్ర, అమరేష్, నాగరాజు, పల్లాహరి పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య కౌన్సిల్ మీట్

● పది నిమిషాల్లోపే ముగిసిన సమావేశం



మున్సిపల్ కార్యాలయం ఎదుట బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

తాడిపత్రిటౌన్, మార్చి 12: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య కౌన్సిల్‌మీట్ జరిగింది. వైస్‌చైర్మన్ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో జరిగిన సమావేశం కేవలం పదినిమిషాల్లో ముగిసింది. దాదాపు 8 నెలల తరువాత సమావేశాన్ని నిర్వహించారు. 2024-25ఏడాదికి సంబంధించి బడ్జెట్ అంశాలను వైస్‌చైర్మన్ చదివి వినిపించారు. తీర్మానించిన అంశాలకు కౌన్సిలర్లు ఆమోదించడంతో సమావేశం ముగిసింది. కొన్నినెలల తర్వాత ఏర్పాటుచేసిన కౌన్సిల్‌మీట్ కావడంతో ఏం జరుగుతుందోనని ముందుజాగ్రత్తగా ఎస్ఐలు రామకృష్ణ, గౌస్‌బాషాలు సిబ్బందితో కలిసి భారీ బందోబస్తు నిర్వహించారు. సమావేశంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బొమ్మనహాళ్, మార్చి 12: కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుంచి ఇంటర్‌మీడియేట్ వరకు చదివే బాలికలు ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కమలమ్మ కోరారు. అనాథలు, బడి మానేసిన బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనర్టీల వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని మార్చి 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకవాలన్నారు. విద్యార్థులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల, ఆదాయ, స్టడి ధ్రువీకరణ పత్రాలను జతపరచాలన్నారు. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్ ద్వారా మెసేజ్ పంపుతామన్నారు.

వలంటీర్లపై చర్యలు తీసుకోండి

యాడికి, మార్చి 12: వైసీపీకి ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రలోభపరుస్తున్న వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు టీడీపీ నాయకులు ఎంపీడీఓ సావిత్రికి విన్నవించారు. వారు మాట్లాడుతూ కొందరు వలంటీర్లు ఇంటింటికి తిరుగుతూ వైసీపీకి ప్రచారం చేస్తున్నారన్నారు. ఓటర్ల వివరాలను ఆరాతీస్తూ ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. వైసీపీకి చెందిన నాయకులతో కలిసి వలంటీర్లు ప్రచారం చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఎంపీడీఓ సావిత్రి మాట్లాడుతూ పార్టీ ప్రచారాల్లో వలంటీర్లు పాల్గొనరాదని ఇదివరకే ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. తెలుగురైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నాగమునిరెడ్డి, ఆదినారాయణ, నరసింహచౌదరి, చంద్ర పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థిని గెలిపించండి

పుట్లూరు, మార్చి12: శింగనమల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు మంగళవారం పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం ఎక్కడా రోడ్డుకు మరమ్మతులు కూడా చేయలేదని ఆరోపించారు. నియోజకవర్గంలో అందరూ కలిసికట్టుగా పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

రంజాన్ మాసం ప్రారంభం

యల్లనూరు, మార్చి12: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసం మంగళవారం నుంచి ప్రారంభమైనట్లు ముతవల్లి తెలిపారు. ఉపవాసం ఉండేవారికి మొదటి రోజున కొత్త పేటకు చెందిన చెక్కభజన బాషా భోజనాలను ఏర్పాటుచేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

తాడిపత్రిటౌన్, మార్చి 12: పట్టణంలోని చింతల వెంకటరమణ స్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. డిసెంబరు 21, 2022 నుంచి మార్చి 12, 2024 వరకు హుండీ ద్వారా వచ్చిన కానుకలను లెక్కించగా రూ.17,28,408 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఈఓతోపాటు కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.